# పురోహిత పరిషత్

## మధురాంతకం నరేంద్ర



"పెండ్లి కూతురు మారిపోయిందా? దానికి మేం జవాబుదారీనా? ఇదెక్కడి అసోద్యం? నా ఇరవై మూడేండ్ల సర్వీసులో ఇట్టాంటి మాటెప్పుడు ఇవలేదే!" కాకా హోటలు ఒకవైపునుంచీ, ఫొటో స్టూడియో మరొకవైపు నుంచీ నెట్టడంతో బాగా చిన్నదైపోయిన పురోహిత పరిషత్ కార్యాలయం లోపల, వెలిసి రంధ్రాలు పడ్డ గోడకు వేలాడుతున్న అలివేలుమంగా వేంకటేశ్వరుల ఫొటోకు కింద, పూరాతత్త్వ ప్రదర్శనశాలకు చెందిన వస్తువులా కనిపిస్తున్న- పాత టేబులు ముందు, చేతులూడిన కుర్చీలో కూర్చున్న వెంకటరమణ దొర్రలుపడ్డ పలువరస వికృతంగా కనిపిస్తూండగా ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు. అతడి బట్టలు చాకలినీ, శరీరం స్నానాన్నీ, గడ్డం బ్లేడునూ మరిచిపోయి చాలా రోజులైపోయినట్టుగా కనిపిస్తోంది.

చుట్టూ అన్నివైపులనుంచీ వినిపిస్తున్న రకరకాల రణగొణ ధ్వనులు అతడి చెవిని సోకుతున్నట్టుగా కనిపించడంలేదు.

అసలే చిన్నదైన పురోహిత పరిషత్ కార్యాలయం గోడల పక్కనంతా డోళ్లూ సన్నాయిలూ, అరటిపళ్ల గెలలూ, పెళ్లి పీటలూ, కంచు చెంబులూ కకావికలుగా నిండిపోవడంతో మరింత చిన్నదిగా కనిపిస్తోంది. గదినంతా కమ్ముకున్న మాడువాసన ముక్కుపుటాలకు తగలగానే ఆగంతకుడు పెద్దగా తుమ్మసాగాడు. గది ద్వారం దగ్గర మధుపర్కాల్లో నిల్చున్న యువతి తిరణాళలో తప్పిపోయిన పాపాయిలా బిత్తర చూపులు చూస్తోంది.

"అయితే ఆ గడపదగ్గిర నిలబడుకోనుండే పెండ్లి కూతురు నీ పెండ్లాం కాదంటావా?" ఇంకా ఆశ్చర్యంలోనే మునిగి తేలుతున్న వెంకటరమణ మరో ప్రశ్న సంధించాడు.

ఆగంతకుడు కూడా ఓసారి తలుపుల దగ్గర నిల్చున్న యువతిని నఖశిఖ పర్యంతం ఎగాదిగా చూసి, "నా పెళ్లి జరిగిందేమో ఈ అమ్మాయితోనేనండీ! కానీ ఈ అమ్మాయెవరో సత్యప్రమాణంగా నాకు తెలియదు!" అన్నాడు.

వెంకటరమణ మరింతగా విభ్రాంతుడైపోతూ "ముక్కూ మొగం తెలియని పిల్లను పెళ్లెట్ల చేసుకున్నావు? అసలు పెండ్లి కూతురు మారిపోయిందని తెలిసిందెప్పుడు నీకు?" అని అడిగాడు.

ఇంకా పొరబాటుకు కారణభూతుడైన వ్యక్తిని చూసినట్టుగానే ఉరివి చూస్తూ, "పౌరోహితుడు పసుపు బట్టలు కట్టుకు రమ్మని చెప్పినంతవరకూ పెళ్లి కూతురు మారలేదు. పెళ్లయిపోయాక మంటపం దగ్గిరినుంచీ దర్శనానికి బయల్దేరాము. గుడిముందు దీపాల వెలుతుర్లో తిరిగి చూశాను. నా ధోవతి కొంగుకు చీర కొంగు ముడిపెట్టబడ్డ అమ్మాయి దేవుడమ్మగాదు!" అన్నాడు ఆగంతకుడు.

ఈసారి ఏమని ప్రశ్నించాలో తోచక "మీరిద్దరే కనబడతా ఉండారు. మీ పెండ్లికొచ్చిన మిగతా జనమంతా ఎక్కడ?" అని వాకబు చేశాడు వెంకటరమణ.

"మాతోబాటు పెళ్లికొచ్చిన వాళ్లు ఇద్దరే! ఒక భార్యా భర్తా. వాళ్లే సాక్షులుగా మీ రిజిస్టర్లో సంతకాలు చేశారు. ఈ సందడిలో వాళ్లెక్కడో తప్పిపోయారు!" అని చెప్పాడు ఆగంతకుడు.

"తప్పోయిన వాళ్లను వెదికి పట్టుకునేదానికి స్పెషల్ స్క్వాడు డిపార్టుమెంటుండది ..." మాట నోరు జారిపోయిన తర్వాతగానీ ఆ పని చేసినందువల్ల పెద్దగా లాభం లేదన్న సంగతి వెంకటరమణకు తోచింది గాదు. "అక్కడెంతసేపని నిలబడతావు? ఇట్లొచ్చి ఈ బెంచీపైన కూర్చో!" అంటూ పెళ్లి కూతుర్ని ఆహ్వానించాక ... "నువ్వు కూడా కొంచెం శాంతం తెచ్చుకోని ఆ కుర్చీలో కూర్చోబ్బా! కావాలంటే రెండు గ్లాసులు నీళ్లు తాగు. ఇది అర్రీబర్రీగా తేలే కథగా లేదు. తొలీనించీ చెప్పు. నీ పేరేంది? పెండ్లెప్పుడు జరిగింది? పెండ్లి కతురెప్పుడు మారిపోయింది. అవన్నీ సరే, నన్నిప్పుడు ఏం జెయ్యమంటావు? అన్నీ వివరంగా చెప్పు!" అన్నాడు వెంకటరమణ.

పాత కుర్చీ కిర్రుకిర్రుమని శబ్దం చేస్తూండగా కూర్చుంటూ "నా పేరు బంగార్రాజు. మాది తూర్పు గోదారి జిల్లా రాపూరు. ఈ అమ్మాయి పేరు జీవరత్న అట! నేను పెళ్లాడాల్సిన అమ్మాయి పేరు మాత్రం దేవుడమ్మ!" అని సమాధానం చెప్పాడు బంగార్రాజు.

"ఇంకా పెండ్లికూతురు మాదిరిగా సిగ్గుపడతా అక్కడే నిలబడిపోతే యెట్ల తల్లీ?" అంటూ విసుక్కోబోయి, "అవును. నువ్వు గూడా పెండ్లికూతురే గదా!" అని నవ్వేసి, "ఇట్లొచ్చి కూర్చోమ్మా!" అని జీవరత్నను హెచ్చరించాక "దేవుడమ్మ అంటే ఏమైనా పెద్ద సినిమా స్టారా? ఆ పిల్లెవురో నా కెట్ల తెలిస్తుంది? ఎక్కడ తప్పొయిందో యెతికినావా నువ్వు?" అంటూ చివరికి బంగార్రాజు కేసి మరో ప్రశ్నను విసిరాడు వెంకటరమణ.


"మీ పురోహిత పరిషత్ మండపాలన్నీ వెతికానండీ! మా వాళ్లు తప్పిపోయారని లౌడ్ స్పీకర్లో రాంరాం చేయించినాను. అన్ని ప్రయత్నాలూ ముగిశాకే ఇలా మీ దగ్గరికొస్తున్నాను. మా వాళ్లందర్నీ మీ ఆఫీసు దగ్గరికే రమ్మని అనౌన్సు చేయించాను. మీ పరిషత్తువాళ్లు నిల్చోబెట్టి వెయ్యి రూపాయలు వసూలు జేసుకున్నారు గదా! యాభై అంకణాలు కూడా లేని చోటులో యెందరొస్తే అందరికీ పెండ్లిండ్లు జరిపిస్తన్నారు గదా! ఇవ్వాళేమిటో మంచి ముహూర్తమని వొద్దంటె పెళ్లిళ్లు. పుట్టలో ఈసిళ్లలాగా మంటపాల నిండా జనమే! ఎవరెవరు ఏయే పెళ్లి తాలూకు జనమో తెలియడంలేదు. ఒక జట్టుతో ఇంకొక జట్టు కలిసిపోయింది. చాలనిదానికి మాకు తూర్పువైపున చోటు అలాట్ చేశారు. అటునైపంతా దీపాలు ఫీజులు పోయాయి. కొవ్వొత్తులు వెలిగించుకుని బ్రాహ్మణులూ, మంగలివాళ్లూ తూతూ మంత్రం పెళ్లి చేశారు. మేము మొత్తం ఉన్నది నలుగురమే! నేనూ, దేముడమ్మా, మా పెళ్లి చేయించడానికొచ్చిన భూషయ్య బాబాయీ, చంద్రమ్మ పిన్నీ! కానీ మా నలుగురికీ గూడా చోటీయకుండా అటు పక్క పెళ్లి జనం గుమిగూడిపోయారు. మంగళ వాయిద్యాలొకవైపు, జనాల గడబిడ ఇంకొకవైపు .... గాలి గూడా చొరబడే చోటు లేదు. చెమటలు పోసి జనాలు వుక్కిరిబిక్కిరైపోతున్నారు ..."

"అందుకని చెప్పి హాలంతా ఏసీ పెట్టించమంటావా నువ్వు? భలే పెద్దమనిషివేలే!" హుంకరిస్తూ బంగార్రాజు మాటలకు అడ్డు తగిలాడు వెంకటరమణ. "మీ రిచ్చిన వెయ్యి రూపాయల్లో బాపనోడికి నన్నూరూ, మంగలోళ్లకు నన్నూరూ పోతే మాకు మిగిలేది ఇన్నూరే! ఆ మండపాల్ని రూములుగా కట్టి బాడిగకిచ్చినా అంతకంటే చానానే వస్తింది. ఏందో దూరాభారం నించీ మీలాంటోళ్లు కొండమీద పెండ్లి చేసుకోవాలని వస్తారు గదా అని మేం పుణ్యానికి పోతావుండాం. ఆ సంగతి సరేలే, మీ పెండ్లి కూతురు మా పెండ్లి మండపాల దగ్గిరే తప్పొయిందనేదానికి సాక్షికమేముండాది?"

బంగార్రాజు గూడా ఈ వ్యవహారాన్ని నింపాదిగా తేల్చక తప్పదని తెలుసుకున్నట్టున్నాడు. "చెప్పాను గదండీ! పసుపు బట్టలు కట్టుకోడం కోసం స్తంభం చాటు కెళ్లేవరకూ దేవుడమ్మ మాతోనే ఉంది. చాలాసేపటివరకూ ఆమె వెలుపలికి రాలేదు. పౌరోహితుడు నాలుగైదుసార్లు హెచ్చరించాడు. అప్పుడు మా చంద్రమ్మ పిన్ని స్తంభం చాటుకెళ్లి బలవంతంగా ఆమె భుజం పట్టి ఇవతలికి లాగి, పెళ్లి పీటలపైన కుదేసింది. బహుశా అప్పుడు దేవుడమ్మనుకొని ఈ అమ్మాయిని తీసుకొచ్చి ఉండాలి!" అంటూ వివరించాడు.

"అవునా తల్లీ! అప్పుడేనా నువ్వు

**ఒట్టే బాబు, నేను కావాలని కోపంగా కిందికి విసిరి కొట్టలేదు.**
**పొరబాటున చెయ్యి జారిందంతే... నన్ను నమ్ము.**



మారిపోయింది?" అని ఈసారి జీవరత్నను ప్రశ్నించాడు వెంకటరమణ.

"స్తంభం ఎనక పక్కకు పోయి పసుపు గుడ్డలు కట్టుకోమని నాకు చెప్పింది భూలోకానే! నేను గుడ్డలు మార్చుకుంటా ఉండగా చెయ్యి పట్టిలాగింది గూడా భూలోకా వాళ్లమనిషనే అనుకున్నాను ..." అంది జీవరత్న తడబడుతున్న గొంతుకతో.

"పెండ్లి పీటలపైన నీ పక్కన కూర్చునుండే మనిషెవరో నీ కప్పుడు తెలియనే లేదా?"

"లేదు .... భూలోకా వాళ్లమ్మ తల దించుకొని కూర్చోమని అప్పటికే నాలుగుసార్లు చెప్పింది. అందుకని నేను తల పైకెత్తి చూడలేదు."

"నువ్వు జూడకపోతే పోయినావనుకో! మీతో వచ్చుండే జనం గూడా చూడలేదా?"

"మా పెండ్లి జనానికి నేను కొత్త. అందురూ భూలోకా వాళ్ల జనమే! వాళ్లు నన్ను చూసింది గూడా ఈ సాయంత్రమే!"

"అప్పుడే అనుకున్నాను, ఇదేందో తగరారు బాపత్తు పెండ్లని. పెండ్లి కొడుకు జనం ఈ సాయంత్రం దాంకా నిన్ను చూళ్లేదంటే ఇదేందో తెలుసుకోవల్సిన యవ్వారమే!" బీడీ ముట్టించి తాపీగా పొగ పీలుస్తూ అన్నాడు వెంకటరమణ.

జీవరత్న బంగార్రాజువైపుకొకసారి ఉరిమి చూసి, ఆ తరువాత మెల్లగా పెదవి కదిపింది. "మాది కర్నూలు దగ్గిర మహానంది. భూలోకాదేమో తిరపతి పక్కన రంగంపేట. పంచాయితీ ఆఫీసులో క్లర్కుగా మా వూరికి వచ్చినాడు. పెండ్లికి వాళ్ల అమ్మా నాయినను వొప్పిస్తానని నాకు మాటిచ్చినాడు. ఆ ప్రకారంగానే పెండ్లి టయానికి వాళ్లందురూ ఇక్కడికి చేరుకున్నారు ..." ఈసారి ఆమె గొంతుక ఏడుపు ముంచుకురావడంతో జీరబోయింది.

"పెండ్లికొడుకు పక్కనుంచీ జనమొచ్చినారు. అయితే మీవైపు నుంచీ ఎవురూ యెందుకు రాలేదు?" కళ్లెగరేసి అదోలా నవ్వుతూ అడిగాడు వెంకటరమణ.

జీవరత్న రెండు మూడుసార్లు గుక్కిళ్లు మింగాక "మా వాళ్ల కీ పెండ్లి ఇష్టం లేదు. మహానంది నుంచీ ఎవరూ రాలేదు!" అంది.

"అదీ సంగతి! ఇక్కడ పెండ్లిండ్లు చేసుకునే వాళ్లలో చానామంది ఇంట్లో చెప్పకుండా వుడాయించినోళ్లే! అయ్యా, సామీ! నువ్వుగూడా ఆ బాపత్తే గదా?" మాటలతో వెటకారపు నవ్వును మిళాయిస్తూ వెంకటరమణ క్రేంకారం చేశాడు.

"యే బాపత్తు పెళ్లో నీ కనవసరం!" టెబుల్‌పైన పెద్దగా శబ్దమొచ్చేలా ఓ గుద్దు గుద్దాక వెంకటరమణకేసి వురిమి చూస్తూ అన్నాడు బంగార్రాజు "దేవుడమ్మ మైనారిటీ తీరిన అమ్మాయి. నేనూ మేజరే! మేం పెళ్లి చేసుకోవాలనుకుంటే కాదనే దెవరు? అదిగాదిప్పుడు కొచ్చేను. ఆరు మాసాలుగా వేచి చూసీ వేచి చూసీ, ఇంత కష్టమూ పడి, ఇప్పుడు పెళ్లి చేసుకుందామనుకుంటే, పెళ్లి కూతురు మారిపోవటానికి కారణం ఎవరండీ? మండపాల్లో సక్రమంగా దీపాలు వెలిగేట్టు చూసే బాధ్యత ఎవరిది? ఎందరు పడతారో అంతమందికి మాత్రమే చోటు కేటాయించాల్సిన పనెవరిది? ఇప్పుడిట్లా కొంపే మునిగిపోతే తప్పెవరిది? ఇదేం ఆషామాషీ వ్యవహారం గాదు. పెళ్లి! పురోహిత పరిషత్తని పేరు పెట్టుకుని డబ్బులు మింగటం కాదు ...."

జరిగిన పొరపాటుకు తమ నిర్లక్ష్యం కూడా కొంతవరకూ కారణమేనన్న సంగతి అర్థం గావడంతో కాస్సేపు వెంకటరమణ నీరసపడిపోయాడు. ఇంతలో తప్పిపోయిన వస్తువేదో చేతికి దొరికినట్టుగా తల పంకిస్తూ, "ఇప్పుడీ పిల్ల ఇంకో పెండ్లి తాలూకూ నపురు గదా! అయితే వాళ్లెందుకు ఈ పిల్లకోసరం యెతకడంలేదు?" అంటూ లా పాయింటును పైకి లాగాడు.

"అక్కడే ఉంది మతలబు. పెళ్లి జరిగి ఇప్పటికి రెండు గంటలవుతోంది. పెళ్లి కూతురు మారిపోయిందన్న సంగతి వాళ్ల కీసరికి తెలిసే ఉంటుంది. కానీ ఇంతవరకూ ఇటువైపుకు తిరిగి చూడలేదు. కారణమేంటి?" బంగార్రాజు కోపంతో నిలువునా ఊగిపోతూ ప్రశ్నించాడు.

సమాధానమేం చెప్పాలో తోచక వెంకటరమణ బిక్కమొహం పెట్టాడు.

"దేవుడమ్మంటే అలాంటిలాంటి అమ్మాయనుకుంటున్నారా?" బంగార్రాజు అదే ధోరణిలో కొనసాగించాడు. "ఇరవై ఆరు కారెట్ల బంగారం. వాళ్ల బాబెవరో తెలుసా? వెంకట్రావంటే ఆ వూర్లోనే యెత్తిన చెయ్యి. అయిదారెకరాల మోతుబరి రైతు. పెరటినిండా ఆవులూ, గేదెలూ అంతా పెద్ద వ్యవసాయం. వొకతే కూతురు. బహుశా ఈసరికి వాళ్ల కీ సంగతి తెలిసుంటది. అప్పనంగా అంత ఆస్తితోబాటు అమ్మాయి దొరికితే వదులుకునే వాళ్లెవరుంటారు? గుట్టు చప్పుడు కాకుండా పిల్లతో గూడా ఉడాయించేసినట్టున్నారు వాళ్లు!"

రెండు మూడు నిమిషాలు ఆలోచించిన తర్వాత "అయితే ఆ పిల్లకు బాగా ఆస్తి ఉందని తెలిసి ఆ పెండ్లోళ్లు కంప్లయింటు చెయ్యలేదంటావు. కానీ నువ్విక్కడ ఇంకొక సంగతిని మరిచిపోయినావు. దేవుడమ్మ అనే ఆ పిల్ల మిఠాయి పొట్లం మాదిరిగా వస్తువేమీ గాదు. కాళ్లూ చేతులూ అన్నీ సక్రమంగా ఉండే మనిషి. ఇష్టం లేని మనిషిని మొగుడని ఆ పిల్లెట్ల వొప్పుకుంటూంది?" అని అడిగాడు వెంకటరమణ.

"అంటే ఇష్టపడే వాళ్లతో వెళ్లిపోయిందంటావా?" బంగార్రాజు కీసారి చెప్పలేనంత కోపం వచ్చింది. లేచి నిల్చుని, రెండు చేతుల్నీ టేబులుపైన ఊతగా పెట్టుకుని ముందుకు వంగి, వెంకటరమణ ముఖంలోకి ముఖం పెట్టి చూస్తూ అతను తూటాలలాంటి మాటల్ని రువ్వసాగాడు. "దేవుడమ్మంటే అందరిలా పోకిరీ వేషాలేసే అమ్మాయనుకున్నారా? ఎంతో గుట్టయిన అమ్మాయి. ఆమె గొంతెలాగుంటుందో వూళ్లో ఉన్న మగపిల్లలకెవరికైనా తెలుసా? ఇంటిదగ్గర తల వంచుకుందంటే తర్వాత తల పైకెత్తడం ఇంటికి తిరిగొచ్చాకే గదా! ఆమె పేరుతో ఆస్తి దండిగా ఉందని ఊళ్లో ఎందరు వలపన్నుక్కూర్చున్నారు! ఎవరికైనా రవంత సందు దొరకనిచ్చిందా?"

ఈసారి వెంకటరమణ అంతగా కంగారుపడలేదు. "అట్లాంటి పిల్ల ఇంట్లోవాళ్లకు తెలియకుండా నీతోబాటూ ఇంతదూరం యెందుకొచ్చినట్టు?" అన్నాడు వెటకారంగా.

బంగార్రాజు అలసిపోయినవాడిమల్లే కుర్చీలో కూలబడ్డాడు. పై నవకంతో ముఖంపైని చెమట బిందువుల్ని తుడుచుకున్నాడు. వంచిన తల పైకెత్తకుండా చెప్పసాగాడు. "పెళ్లి కూతురు మారిపోయిందని మీతో కంప్లయింటిస్తున్నానని నన్ను శుద్ధ దద్దమ్మని అనుకుంటున్నారు గదా! వట్టి చేతుల్తో వూరుగాని వూరికి చేరినవాణ్ణి. ఎలా కష్టపడ్డానో, ఎలా కూడబెట్టానో ఎవరికి తెలుసు? పల్లెరెడ్డిగా పుట్టినవాణ్ణి. హోటలు వ్యాపారం వీడేం చేస్తాడులే అన్నారు గదా అందరూ. వొకటి రెండేళ్లలో ఏం జరిగింది? ప్రతిరోజూ సాయంకాలానికల్లా నూరు నూట యాభై వరకూ నా చేతిలో ఆడుతోంటే వూళ్లోవాళ్లే నోరు తెరిచేశారు గదా! నాలాంటి చాకయిన కుర్రాడు వూళ్లో మరొకడు లేడని అందరూ వొప్పుకున్నారు, తెలుసా?"

"అయితే ఆ పిల్ల వూళ్లో వాళ్లందరినీ కాదని, నీ తెలివితేటల్ని చూసి నిన్ను వలచిందంటావు!" వెంకటరమణ కుతూహలాన్ని అణచి పెట్టుకోలేకపోయాడు.

"అదేమంత సులభంగా జరిగిన వ్యవహారం గాదు. రెండేళ్లుగా వాళ్ల ఇంటి ముందే టీ హోటలు నడుపుతోంటే దేవుడమ్మ నా వైపైనా కన్నెత్తి చూసిందంటారా? లేదే! టిఫిన్లూ కాఫీలు సరఫరా చేసినా ఆ అమ్మాయి మనసు మెత్తబడ్డదా? గడచిన సంక్రాంతి పండుగ రోజునే గదా ఆవిడ నాతో మాటా మాటా కలపడం? టౌను నుంచి కావాలన్నదల్లా తీసుకొచ్చి పెట్టానా లేదా? యెన్ని బహుమతులూ,

### అన్నీ తక్కువే!

రామారావు భార్యమీద మండిపడ్డాడు...

"ఏం ఖర్చులు, ఏం లోకం! ఈ బిల్లులు చూస్తుంటే కళ్లు తిరిగిపోతున్నాయి. వెచ్చాల బిల్లులు, టెలిఫోన్ బిల్లు, బట్టల బిల్లు, కరెంటు బిల్లు ... ఏది తగ్గినా నేను సంతోషిస్తాను!" అన్నాడు.

అక్కడే ఉన్న పుత్రరత్నం "అయితే డాడీ, నా ప్రోగ్రెస్ కార్డు చూడండి. అన్నీ తక్కువే!" అన్నాడు.

పుష్పా ప్రకాష్ (భాగ్యనగరం

యెంత ఖర్చూ! అయినా పెళ్లి మాటన్నప్పుడల్లా కంగారుపడ్డమే గదా! ఆమెను వప్పించడానికి దేవుడే దిగొచ్చాడు. కొండమీద పెళ్లి జరిపించాలన్న మొక్కుందని అన్నప్పుడు నేను కాదన్నానా? చివరికేమయింది? నా కష్టాన్నంతా ఎవరో తన్నుకెళ్లిపోయారు గదా! ఇందుకు మీ చీకటి మండపాలే గదా కారణం? మిమ్మల్ని వూరికే వదులుతా ననుకోకండి!" మళ్లీ కోపంతో పళ్లు పటపటలాడించాడు బంగా(రాజు.

అతడి కోపాన్ని సరకు చేయనన్నట్టుగా మరో బీడీని రంగిలించుకున్నాడు వెంకటరమణ. తరువాత "కన్న తల్లిదం(డులకు తెలియకుండా యెవుడో ముక్కూ మొగం తెలియనోడితో ఈ మాదిరిగా వచ్చేసేది తప్పు గదా?" అంటూ తన దృష్టిని జీవరత్ననైపు మళ్లించాడు.

చిగురుటాకులా నవనవలాడుతున్న జీవరత్న చురకత్తుల్లాంటి పదునైన చూపుల్ని సారిస్తూ, "భూలోకా ముక్కూ మొగం లేని మనిషి గాదు ..." అంది కరకుగా. "వాళ్లకు గూడా వాళ్ల వూళ్లో భూములుండాయి!" అంటూ ముక్తాయించింది.

"మీ నాయినేం జేస్తాడు?" సహేతుకమైన కారణంకోసం వెతుకుతున్నాడు వెంకటరమణ.

"వ్యవసాయమే! ఇరవై రెండెకరాలుంది మడి. మా అమ్మా, నాయనకు నేనూ ఒకతే సంతు!"

"రెండుపక్కలా బాగా వుండేవాళ్లే గదా! పెద్దోళ్లను వొప్పించి పెండ్లి చేసుకోవచ్చు. ఈ మాదిరి దొంగతనంగా యెందుకు పెండ్లాడాల?" వెంకటరమణకు వొకదాని వెంటవొకటిగా సందేహాలు పుడుతూనే ఉన్నాయి.

"మా ఇద్దరిదీ వొక కులం గాదు. భూలోకావాళ్లు నాయిళ్లు. మేము బలిజోళ్లం!" చెబుతున్న వర్తమానంతో తనకేమీ సంబంధం లేనట్టుగా యథాలాపంగా జవాబు చెప్పింది జీవరత్న.

"ఈ పెండ్లికి ఆ భూలోకనాయుడి తరపున్నించీ మాత్రం బంధువులు వచ్చినారంటివి గదా? వాళ్లు మాత్రం యెందుకభ్యంతరం చెప్పలేదు?"

"మొదట్లో వాళ్లూ వొప్పుకోలేదు. మా భూలోకనాయుడే వాళ్లను బలవంతంగా వొప్పించినాడు."

తన (ప్రాసిక్యూషన్ ముగిసినట్టుగా వెంకటరమణ కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు. అతడికెదురుగా కూర్చున్న బంగా(రాజు సైతం శాంతించినట్టుగా కనిపిస్తున్నాడు.

కిటకీలోంచీ కనిపిస్తున్న విశాలమైన వీధిలో ఇసుకేస్తే రాలనంత మంది జనం గుమిగూడిపోయి ఉన్నారు. రాత్రి పదకొండు గంటలు కావస్తున్నా వీధికిరువైపులా ఉన్న అంగళ్లలో బేరసారాల వుధృతి తగ్గలేదు. వీధికి పడమటివైపున్న ఆస్థాన మండపంనుంచీ వెలువడుతున్న హరికథ జనాలనేమీ ఆకర్షించలేకపోతోంది. దారి తప్పిన బాటసారి ఆక్రోదనలా గుడిలోంచీ మంగళవాయిద్యం స్పష్టాస్పష్టంగా వినబడుతోంది. పురోహిత పరిషత్తు కార్యాలయం ముందునుంచీ వీధిలోకి దారితీస్తున్న మెట్ల వరసకు పక్కన పెద్ద ఇనుప తలుపుల గుమ్మం కనిపిస్తోంది. లోపలవైపున్న పెళ్లి మంటపాల నుంచీ వచ్చిపోయే జనాలతో అది తేనె తుట్టెలా తత్తళించిపోతోంది.

కార్యాలయం పక్కనున్న టీ హోటల్లో బాయిలర్ ముందు పెద్ద పెద్ద మీసాలున్న పహిల్వానులాంటి వ్యక్తి టీ కలుపుతున్నాడు. "ఇదిగో గోయిందరాజులూ! ఆ యెలక్ట్రీషియన్ కనిపిస్తే ఇట్ల రమ్మను!" అంటూ అతడికో సందేశాన్ని సరఫరా చేశాక "అట్నే మీ పిల్లోడి దగ్గిర మూడు టీలు అంపించు!" అన్నాడు వెంకటరమణ.

టీ గ్లాసు తమముందుకొచ్చేవరకూ అందరూ మౌనంగా ఉండిపోయారు.

సగం గ్లాసు పూర్తిచేసిన తరువాత "అక్కడా కులాలు వేరే వేరేనే! ఇక్కడా అంతే! రెండూ వొకేమాదిరిగా దొంగ పెండ్లిండ్లే!" అంటూ స్వగతంలా గొణుక్కుని, అదేదో జోక్ అయినట్టుగా నవ్వేశాడు వెంకటరమణ. టీ గ్లాసులోని మిగిలిన (ద్రవాన్ని ఖాళీ చేయగానే అతడి మెదడులో మెరుపులా మరో ఆలోచన తట్టింది. "ఇప్పుడు జీవరత్నమయితే నేమి? దేవుడమ్మ అయితే నేమి? మారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అంటారు. మీ కిద్దురికీ ఈ విధంగా దేవుడు రాసిపెట్టుంటాడు. అందుకే ఆ పెండ్లి కూతురుతో వాళ్లు కిముక్కు మనకుండా వెళ్లిపొయ్యుంటారు!" సమాధాన మేమంటారన్నట్టుగా వాళ్లిద్దరికేసీ పరీక్షగా చూశాడు వెంకటరమణ.

ఖాళీ టీ గ్లాసును టేబులుపైన వుంచుతున్న బంగా(రాజు పెదవుల్లోంచీ "తూర్పు గోదారి జిల్లాలో ఆరెకరాలకూ, కర్నూలు జిల్లాలో ఇరవై ఎకరాలకూ తేడా లేదా?" అన్న మాటలు గులకరాళ్లలా ఇవతలకి పడ్డాయి.

"చూడు బంగా(రాజూ! నువ్వేందో కోర్టూ పోలీసులూ అంటా వుండావని నేను బయపడతా ననుకుంటూ వుండావేమో! జరిగిందాంట్లో మా తప్పేమీ లేదు. కానీ వొక మాట చెప్తాను విను. మంచి మాట ఎవురు చెప్పినా వినాల. మీ తూరుపు గోదావరి జిల్లాను నేను గూడా చూసినాన్లే!" వెంకటరమణ ఈసారి పెద్దగానే నవ్వేశాడు. "నువ్వెప్పుడైనా కర్నూలు జిల్లాలో మహానంది దగ్గరుండే మడిచెక్కను చూసినావా? మీ కోనసీమ భూములు కూడా వీటిముందు పనికిరావు!" వెంకటరమణ జీవరత్నవైపుకు తిరిగాడు. "ఏ రకంగా చూసినా దేవుడు నీకు మేలే చేసినాడు. తుమ్మితే వూడిపోయే ముక్కుతో ఎంతకాలమని యేగతావు? ఈ బంగా(రాజు చూడు, వూరు దూరమే గావచ్చు. వుద్యోగం లేదనుకో! అయితే యేం? జమ్మని సొంతంగా హోటలు పెట్టుకున్నాడు. కావాలంటే మీ వూరికే వచ్చేస్తాడు. ఆ భూలోకనాయుడిలాంటి వాళ్లు నలుగురికి జీతం ఇస్తాడు. అంతెందుకు? ఇంత జరిగినా నిన్ను నడిదార్లో దిగ్గొలకలేదు!"

జీవరత్న సమాధానమేమీ చెప్పలేదు. కానీ ఈసారి తన చూపులకడ్డంగా సజీవ పదార్థమేదో అడ్డు తగిలినట్టుగా ఆమెకు తోచింది. ఆమె కళ్లల్లో సన్నటి మెరపు రేఖ మెరిసింది. బంగా(రాజు సైతం జీవరత్న వైపు ఆసక్తితో పరకాయించి చూడసాగాడు.

"పిల్ల లక్షణంగా ఉండాది. పెండ్లాడినోడికి లక్షణమైన ఆస్తి గిట్టుబాటవతాది. వస్తా వస్తా నక్కతోక తొక్కొచ్చినట్టుండావు. ఆలోచించుకో బంగా(రాజు, వూరికే గొడవపడితే నీకు గానీ, నాకు గానీ వచ్చే లాభం లేదు. నువ్వూ బాగా ఆలోచించుకోని చూడు జీవరత్నమ్మా! పిల్లోడు కంటికి నదురుగా ఉండాడు. బంగారట్లా యూపారం. నువ్వు సెలెక్ట్ చేసుకున్నోడు మాదిరిగా యేరు దాటకుండానే తెప్ప తగలేసేవాడు కాదు. కావాలంటే ఇద్దరూ మాట్లాడుకోండి. నేనా పక్కకు పోయి మండపాల దగ్గిర బల్బులు తగిలించేసి వస్తాను!" ఇద్దరికీ సూచనలిచ్చాక వెంకటరమణ మెట్లు దిగి పెండ్లి మండపాలలోకి వెళ్లిపోయాడు.

యెవరు ముందు మాట్లాడుతారా అని పందెం వేసుకున్నట్టుగా నూతన వధూవరులిద్దరూ కాస్సేపు మౌనంగా ఉండిపోయారు.

పురోహిత పరిషత్ కార్యాలయపు కిటికీలోంచీ రోడ్డుపైన కిటకిటలాడుతున్న జనసమూహం స్పష్టంగానే కనబడుతోంది. కింద మండపాల ద్వారం దగ్గర నిల్చున్న గుంపులోంచీ కొత్త దంపతులకు చీకటి ఆకాశంలో అరుంధతిని వెతుక్కోమని సవాలు విసురుతున్న పురోహితుడు కూడా స్పష్టంగానే కనబడుతున్నాడు. ఆ గుంపును ముందుకు నెడుతున్నట్లుగా మరో సమూహం ముందుకు కదులుతోంది. ఆస్థాన మండపం నుంచీ హరిదాసు పాడుతున్న మంగళకీర్తన స్పష్టంగానే వినబడుతోంది.

చివరకు తానే వోడిపోయినట్టు అంగీకరిస్తున్నట్టుగా "ఇంటికెళ్తే మీ వాళ్లేమీ అనరా?" అని అడిగాడు బంగా(రాజు.

"ఎందుకనరు? నే నీ సంగతి వాళ్లకు చెప్పేసినాను. వాళ్లు గోడుగోడు మన్నారు. అయినా పెళ్లాడేది వాళ్లా, నేనా? నా ఇష్ట(ప్రకారం నేను పెళ్లి

### పళ్ల డాక్టరు

'ఆదేంటండీ, మనమ్మాయికి ఆ కళ్ల డాక్టర్ బావున్నాడు కదా? మరి ఆ పళ్ల డాక్టరుని సెలెక్ట్ చేశారేమిటి?" అడిగింది ఇల్లాలు.

"ఓసి పిచ్చిమొద్దూ! మనిషికి కళ్లు రెండే ఉంటాయి. పళ్లు 32 ఉంటాయి. కనుక పళ్ల డాక్టరుకే కేసులెక్కువ!" చెప్పాడు ఇంటాయన.

చందూ వంశీ (ప్రొద్దుటూరు)

చేసుకునే దానిలో వాళ్ల ప్రమేయమేముంది?" అందామె మెల్లగా.

"పెళ్లయ్యాక ధైర్యంగా ఇద్దరూ మీ ఇంటికే వెళ్దామనుకున్నారా?"

"మా ఇంటికి కాక ఇంకేడికి పోతాం? ముందుగా మా అమ్మా, నాయినా అరిచి రాద్ధాంతం చేస్తారేమో! అంతమాత్రానికే బెదిరిపోవాల్నా? నా దగ్గిర ఆ పప్పులేం వుడకవు. మా ఇంట్లో నేనెంత చెప్తే అంతే!"

బంగార్రాజు కళ్లార్పడం సైతం మరచిపోయి జీవరత్నవైపే చూస్తున్నాడు. నలిగిన పసుపు బట్టల్లో ఆమె శరీరం ఆకులు విప్పుకున్న అరటి బోదెలా కళకళలాడుతోంది. ఆమె చూపులు తన చూపులతో భేటీ పడగానే అతడు దృష్టిని మరల్చుకుంటూ, "ఆడపిల్లలు గూడా అలా ధైర్యంగా ఉండాలి. దేవుడమ్మకు చెప్పి వప్పించడానికి తల ప్రాణం తోకకొచ్చింది. ఇక్కడి కొచ్చాక కూడా వాళ్లమ్మా బాబుల్ని తలుచుకుని యేడుస్తూనే ఉంది ..." అని కాసేపాగి, "మాది అసలు వొంగోలు జిల్లా మాచవరం. కర్నూలు జిల్లాలో మాకు బంధువులు దండిగా ఉన్నారు!" అన్నాడు.

చెప్పులు టపటపలాడించుకుంటూ వెంకటరమణ గదిలోకొచ్చాడు. "నా బీడీ కట్టను ఇక్కడెక్కడో పెట్టి మరిచిపోయినాను!" అంటూ టేబులు చుట్టూ తిరగసాగాడు.

అతడి వెనకే మెట్లెక్కి వచ్చిన ఆగంతకుడు "సార్! సార్! ఇక్కడ ఆఫీసులో ఉండేది మీరేనా?" అని అడిగాడు ఆందోళనతో తడబడుతున్న గొంతుకతో.

అయితే యేమంటావన్నట్టుగా తిరిగి చూశాడు వెంకటరమణ.

"మీ రిజిస్టర్లో మా పెళ్లి కూతురు పేరు తప్పుగా యెంట్రీ పడింది. కొంచెం దాన్ని సరిదిద్దాల!" అన్నాడతను.

"పెండ్లి జరిగిందెప్పుడు? పేర్లేమి?" కుర్చీలో కూర్చుని రిజిష్టరు తిప్పుతూ అడిగాడు వెంకటరమణ.

"అబ్బాయి పేరు భూలోకనాయుడు. అమ్మాయి పేరు దేవుడమ్మ అని ఉండాల్సింది. జీవరత్న అని రాసేసినారు పొరబాటున ..."

వెంకటరమణ బక్కెట్టు నీళ్లు తలపైన దిమ్మరించినట్టుగా నిటారుగా కూర్చున్నాడు. ఆగంతకుడికేసి చిలిపిగా చూస్తూ, "పేరు తప్పాయిందా? పెండ్లి కూతురు మారిపోయిందా?" అని ప్రశ్నించాడు.

"ఈ సంగతి అప్పుడే మీ దాంకా వచ్చేసిందా సార్!" ఆగంతకుడు అసురసురంటూ చెప్పసాగాడు "యేం చెయ్యమంటారు? మా కొడుకు వొట్టి యామాళం. చూసీ చూసీ మగరాయుడిలాంటి పిల్లను కానరాని దేశం నుంచీ తీసుకోనొచ్చి పెండ్లి చెయ్యమని కూర్చున్నాడు. ఆ పిల్లకు అణకవే లేదు. మాటకు మాట. కుదురూ బెదురూ లేదు. ఇట్లాంటి పిల్ల నీతో యెట్ల సంసారం జేస్తిందిరా అని నా పెండ్లాం మొత్తుకునింది. వాడింటే గదా! కానీ ఈ కొండపై నుండే దేవుడుండాడే సార్! భలే మహత్యముండే దేవుడు. సరిగ్గా టయానికి పెండ్లి కూతుర్నే మార్చేసినాడు. పెండ్లి కావడం కావడం నేరుగా జీబులలో కెక్కి కొండ దిగేసినాం. చెపితే నమ్మరు గానీ, అప్పుడు గానీ పెండ్లి కూతురు మారిపోయిందనే సంగతి మాకు తెలియలేదు. జీబులో పొయ్యేటప్పుడు ఈ పిల్ల ఇంత సంసారపొగ్గా ఉందేమిరా అని నేను గూడా ముక్కుపైన వేలేసుకున్నోడ్నే! ఆ తర్వాతే గదా తెలిసింది నిజెం. అంత ఆస్తీ పాస్తీ వుండే పిల్లే అయినా ఈ పిల్ల ఎంత వినయం! ఎంత సాంప్రదాయం! మొత్తానికి మా ఆడోళ్లు మొక్కుకున్నట్టుగా బుద్ధిమంతురాలైన కోడలొచ్చింది, అదే చాలు!"

"నువ్వు కోడలొచ్చిందని భుజాలెగరేస్తే సరిపోయిందా పెద్దాయినా? నీ కొడుకును నమ్ముకోని ఇంత దూరం వచ్చిన ఆడకూతురు గతేం కావాల?" వెంకటరమణ కోప్పడసాగాడు.

"ఆ పిల్ల సంగతి మీ కేం తెలుసు సార్! గుడినీ, దేవుడ్నీ రెండిట్నీ అమ్మేసి వూరికి పోయే రకం. అయినా ఇది దేముడి ముందుర జరిగిన పెండ్లి. కాదనేదానికి మనమెంత సార్! అదో! మా పెండ్లి జరిపించిన బాపనాయన గూడా వచ్చినాడు చూడండి టయానికి. బాపనాయిన సాక్షికమంటే బగమంతుడి సాక్షికమనే గదా అర్థం!" ఆగంతుకుడేమీ బెంబేలు పడటంలేదు.

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన వ్యక్తికేసి చూసి "నీ తెలివి తెల్లారినట్టే ఉంది. వీడేందీ, బాపనోడేంటీ?" అంటూ నవ్వేశాడు వెంకటరమణ. "పెండ్లి కూతురు చీకట్లో మారిపోయిందని దబాయిస్తా వుండావు గదా! అయితే పురోహితుడికీ మా అటెండరుకూ గూడా తేడా తెలియలేదా నీకు?"

అదేమంత పెద్ద విషయం గాదన్నట్టుగా ఆగంతకుడు నవ్వేశాడు. "మీ పరిషోత్తోళ్లు పంపించిన మనిషయితే మా కంతే చాలు! వాడు బాపనోడో కాదో తెలుసుకునే పని మా కెందుకు? మీరు కొంచెం ఆ పేరు మార్చేయండి. తర్వాత యెట్లో పోయి యెట్లొస్తిందో యెవురికి తెలుసు? మా కోడలలు పేరు దేవుడమ్మ!" మాట్లాడుతూనే వొక పచ్చ నోటు పైకి తీసి వెంకటరమణ చేతిలో పెట్టి, "మీ కష్టం పెట్టుకునే మనిషి గాదు నేను. ఆ పురోహితుడికి గూడా కొంచెం ఇయ్యండి!" అన్నాడతను.

వెంకటరమణ బంగార్రాజుకేసి తిరిగి చూశాడు. ఆత్రుతతో అటువైపే కలయజూస్తున్నాడు. జీవరత్నం మాత్రం జరుగుతున్న తతంగంలో తన పాత్రేమీ లేనట్టుగా ముఖం అవతలకి తిప్పుకుని ఉంది. రిజిస్టరులో పేరును సరిదిద్దే పనిలోకి దిగసాగాడు వెంకటరమణ. ఆగంతకుడు వొక నమస్కారాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

"యేరా బ్రహ్మయ్యా! ఈ యాపారం యెప్పటి నుంచీ మొదలుపెట్టినావబ్బా!" అన్నాడు వెంకటరమణ పచ్చనోటును నింపాదిగా జేబులోకి నెడుతూ.

"జమ్మని ఆఫీసు కుర్చీలో కూర్చుని ఆర్డర్లు జారీ చేసేవాళ్లకు మా బాధలేం తెలస్తాయిలేన్నా! వచ్చినోళ్లకంతా బాపనోళ్లనీ, మంగలోళ్లనీ సప్లయి జెయ్యాల్నా! వొకొకసారి వొద్దంటే జనం వచ్చి పడిపోతారు. బాపనోడు ఖాళీ లేడంటే వింటారా వాళ్లు? కొంతమందయితే కొట్టను కొట్టనొస్తారు. మా డ్యూటీ చేసేది యెంత కష్టమో నీకేం తెలుసు? అప్పుడప్పుడూ ఇట్లా తాసికలు మాసికలు చెయ్యకపోతే గత్యంతరం లేదు ..." అన్నాడు బ్రహ్మయ్య.

బంగార్రాజు పైకి లేచి తన జేబులోంచీ వొక పచ్చనోటును పైకి తీసి వెంకటరమణ ముందుంచుతూ "మీ అటెండర్ని బ్రాహ్మడనుకుని మొదట కాళ్లావేళ్లా బడ్డది నేనే గదా సార్! ఇంతలో వేరే బ్రాహ్మణుడొచ్చాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే మా పెళ్లి గూడా యీయన చేతులపైనే జరిగేది. యెంతలో యెంత ప్రమాదం తప్పిందో చూడండి. యెంతయినా మీ పెద్దోళ్లు చెప్పే మాటలు తప్పు గాదు సార్! మీరు చెప్పినట్టు పెళ్లిళ్లనేవి స్వర్గంలోనే చేసుంటారు!" అన్నాడు హుషారుగా.

వెంకటరమణ చేతిలోని పచ్చనోటును అలవోకగా తన గుప్పిటలోకి లాక్కుని, "ఆ సంగతి నాకు తెలియదు. పెండ్లిండ్లు మా పురోహిత పరిషత్తులో జరగతాయనేది మాత్రం రూపాయికి పదారణాలన్నంత నిజం!" అంటూ మెట్ల దగ్గరకి గెంతాడు బ్రహ్మయ్య.

పురోహిత పరిషత్ కార్యాలయంలోంచీ యేదో అడుగుతున్న వెంకటరమణ మాటలు పెళ్లి మండపాలలోకి దూరేసిన బ్రహ్మయ్య చెవిన పడనేలేదు.

■

### గవర్నమెంటు ఉద్యోగులు

"మీ ఆయన నిన్నెలా చూసుకుంటున్నాడమ్మా?" అమ్మగారింటికి వచ్చిన కూతుర్ని అడిగింది తల్లి.

"ఏం చూడ్డం అమ్మా, ఎప్పుడు చూసినా నిద్రపోవడమే!" అని అసంతృప్తిగా చెప్పింది కూతురు.

"మరి నేను ముందే చెప్పాను కదా, అసలు ఈ గవర్నమెంటు ఉద్యోగుల్ని చేసుకుంటే ఇంతేనని!"

పుష్ప ప్రకాష్ (భాగ్యనగరం)